# సరిపోల్చుకునే పరీక్ష



# సరిపోల్చుకునే పరీక్ష

## The Trial of Comparison

*Christian Resources App > Audio Sermons > “Ric Cunningham – The Trial of Comparison”)*

***English version :***

***Christian Resources App***

***Telugu Translated by :***

***HOSUR BIBLE STUDENTS***

# సరిపోల్చుకునే పరీక్ష

*- Ric Cunningham, USA*

సరిపోల్చుకునే పరీక్ష. బహుశా మీరు దీన్ని ఇంత వరకు అనుభవించి ఉండకపోవచ్చు లేదా బహుశా ఇది భవిష్యత్తులో ఎదురయ్యేది అయి ఉండవచ్చు లేదా బహుశా మీరు దీన్ని గతంలో కలిగి ఉండవచ్చు లేదా బహుశా మీరు దాని గుండా వెళుతూ ఉండవచ్చు.....

మనము కొన్ని లేఖనాల ఉదాహరణలను పరిశీలిద్దాం, అవి మీకు బహుశా తెలిసినవి. అయితే ఈ సరిపోల్చుకునే పరీక్ష లో కొన్ని ఎలా రావచ్చో నిర్ధారించడానికి ఇది ఒక సాధనంగా ఉంటుంది.

## కయీను మరియు హేబెలు

కయీను మరియు హేబెలు గురించి మీకు గుర్తుండే ఉంటుంది. అక్కడ సరిపోల్చుకునే పరీక్ష జరిగింది, కాదా? కయీను పెద్దవాడు, హేబెలు చిన్నవాడు. వారు దేవుడు ముందు తమ బలులు అర్పించారు మరియు కయీనుది ఆమోదయోగ్యం కాలేదు, హేబెలుది ఆమోదయోగ్యం అయింది. కానీ కయీను దీని గురించి కలత చెందాడు. తాను అర్పించిన బలిని దేవుడు ఎందుకు అంగీకరించలేదు? మరియు హేబెలు మాదిరిగానే అర్పించినట్లయితే, అది ఆమోదయోగ్యమైనదని అతనికి తెలియజేయడానికి దేవుడు ఏదో ఒక పద్ధతిలో కయీనుతో మాట్లాడాడు. కానీ అతను అలా చేయకపోతే, ఈ ప్రతికూల వైఖరి కొనసాగితే, పాపం తలుపు వద్ద పొంచి ఉంటుంది.

కయీను తన తమ్ముడి మాదిరిని/ఉదాహరణను అనుసరించడం, చాలా వినయపూర్వకమైన అనుభవంగా భావించిన దానికి తనను తాను సమర్పించుకోలేకపోయాడు. కాబట్టి, అతని సమర్పణ ఆమోదయోగ్యం కాలేదు మరియు అది దేనికి దారితీసింది? అది కయీను తన సోదరుడితో తనను తాను పోల్చుకోవడానికి దారితీసింది మరియు దానితో జీవించలేక, కోపంతో హేబెలును చంపాడు. మానవుడి చేతిలో మానవుడు హత్య చేయబడిన మొదటి సంఘటన.



నూతన సృష్టిగా మనం ఈ సంఘటన నుండి ఏమి నేర్చుకోవచ్చు? మనం మన త్యాగాన్ని మన సహోదరుల త్యాగంతో పోలుస్తూ ఉండవచ్చు. మనం ఇతరుల నుండి నిర్మాణాత్మక విమర్శలను లేదా సూచనలను స్వీకరించగలమా, లేదా మనం దానిని మన మార్గంలో కలిగి ఉండాలనుకుంటున్నామా? బహుశా మనం మరొకరి త్యాగంతో మన చిన్న త్యాగాన్ని పోల్చుకుంటున్నామా, దేవుడు

మరొకరి త్యాగాన్ని అంగీకరిస్తున్నట్లుగా మన త్యాగాన్ని కూడా అంగీకరిస్తున్నాడా లేదా మెచ్చుకుంటున్నాడా అని బయటికి కనిపించే సాక్ష్యం కోసం చూస్తున్నామా? ఇది అక్షరార్థ హత్య చేయడానికి దారితీయకపోవచ్చు, కానీ మనం మన సహోదరుల గురించి దుర్భాషలాడవచ్చు మరియు దుష్టంగా మాట్లాడవచ్చు లేదా దుష్టంగా ఊహించవచ్చు మరియు తద్వారా వారి వ్యక్తిత్వంను హత్య చేయడం ద్వారా పరోక్షంగా వారిని చంపవచ్చు. ప్రభువు ప్రజలమైన మనలో కూడా అసూయ, ఈర్ష్యలు తలెత్తుతాయి మరియు అలాంటి హేయమైన/అతి క్రూరమైన నేరానికి పాల్పడవచ్చు.

## యిర్మీయా, యెహెజ్కేలు మరియు దానియేలు

ఇప్పుడు, యెహోవా తన గొప్ప ప్రవక్తలైన యిర్మీయా, యెహెజ్కేలు మరియు దానియేలుతో ఎలా పనిచేశాడో పరిశీలిద్దాం. ఈ ముగ్గురూ సమకాలీకులు మరియు వారు ఒకే సమయంలో ప్రవచించారు. యిర్మీయా పెద్దవానిగా, తర్వాత యెహెజ్కేలు అటు తర్వాత దానియేలు చిన్నవానిగా ఉన్నారు.

యిర్మీయా ఇశ్రాయేలుపై యెహోవా ధిక్కారాన్ని మరియు బబులోను ద్వారా రాబోయే శిక్షను గురించి సాక్ష్యమిస్తున్నాడు, రాజు వినయంగా దేవుని సూచనలను అంగీకరించవచ్చు. కానీ బదులుగా రాజు అతని సలహాను తిరస్కరించి, యిర్మీయాను అత్యంత భయంకరమైన రీతిలో ఖైదు చేశాడు. దీని గురించి మనం యిర్మీయా 38:6 లో చూడవచ్చు:

**యిర్మీయా 38:6 "వారు యిర్మీయాను పట్టుకొని కారా గృహములోనున్న రాజకుమారుడగు మల్కీయా గోతి లోనికి దింపిరి.**

**అందులోనికి యిర్మీయాను త్రాళ్లతో దింపినప్పుడు ఆ గోతిలో నీళ్లు లేవు, బురదమాత్రమే యుండెను, ఆ బురదలో యిర్మీయా దిగబడెను."**

పాపం యిర్మీయా! బయటపడే మార్గం లేదు. రాత్రిపూట పూర్తి చీకటిగా మరియు బహుశా పగటిపూట కూడా చాలా మసకగా మాత్రమే ఉండవచ్చు. బహుశా కీటకాలు, బల్లులు మరియు పాములు కూడా ఉండి ఉంటాయి.

మీరు ఎప్పుడైనా బురద నీటిలో ఈత కొట్టారా? అడుగున మీ కాళ్ళు తాకినప్పుడు, అది మొత్తం బురదగా మరియు మట్టిగా ఉందా? ఇది దానికంటే చాలా ఘోరంగా ఉంది. అతను ఆ బురదలో ఎంత లోతుకు మునిగిపోయాడో మనం ఊహించగలం.

ఇప్పుడు, యిర్మీయాకు బయటపడేందుకు ఎటువంటి మార్గం లేదని మరియు ఉపశమనం కోసం బురద నుండి తనను తాను పైకి నెట్టుకోవడానికి కూడా మార్గం లేదని గుర్తు చేసుకోగలము.



దాదాపు అదే సమయంలో, బబులోను సామ్రాజ్యం యొక్క ఉత్తర మరియు పశ్చిమ భాగంలోకి బందీలుగా తీసుకువెళ్ళబడిన ఇశ్రాయేలీయులలో యెహోవా ప్రవక్తగా ఉన్న యెహెజ్కేలును మనం చూడగలము.

యెరూషలేము ముట్టడి గురించిన సాక్ష్యంగా యెహోవా అతన్ని ఏమి చేయమని చెప్పాడో నాల్గవ అధ్యాయం నుండి సంగ్రహించగలము.

అతను ఇశ్రాయేలు ఇంటి వారి దోషము కోసం తన ఎడమ వైపున పడుకోమని ఆదేశించబడ్డాడు - అతను ఎడమ వైపున పడుకునే రోజుల సంఖ్య ప్రకారం, అతను వారి దోషాన్ని భరిస్తాడు. యెహోవా వారి దోష సంవత్సరాలను, రోజుల సంఖ్య ప్రకారం, మూడు వందల తొంభై రోజులు అతనిపై విధించాడు, తద్వారా అతను ఇశ్రాయేలు ఇంటి వారి దోషాన్ని భరిస్తాడు.

అతను వాటిని నెరవేర్చిన తర్వాత, అతను మళ్ళీ తన కుడి వైపున పడుకుని, యూదా ఇంటి వారి దోషాన్ని నలభై రోజులు భరించాడు. యెహోవా అతనికి ప్రతి రోజు,ఒక సంవత్సరంగా నియమించాడు.



కాబట్టి ఇక్కడ యెహెజ్కేలు మూడు వందల తొంభై రోజులు మరియు తరువాత నలభై రోజులు ఒక ప్రక్కన పడుకొని ఉన్నాడు. అది ఒక సంవత్సరం కంటే ఎక్కువ, కదా సహోదరులారా? ముట్టడి చేయబడిన యెరూషలేమును వర్ణిస్తూ/ చిత్రీకరిస్తూ, ఒక ఇనుపరేకును తన ముందు ఉంచి, యెహెజ్కేల్ ఒక సంవత్సరం పాటు ఒక వైపు పడుకోగలిగాడని మీరు ఎలా అనుకుంటున్నారు? అంతే కాకుండా, అతను కదలలేని విధంగా గొలుసులు లేదా బంధాలతో బంధించబడ్డాడు! అయినప్పటికీ, ఇది అతని సాక్ష్యం. అతను ఒక సజీవ ప్రవచనం! ఇతర యూదులు బందీలుగా/బందిఖానాలో ఉన్నప్పటికీ, వారి జీవనోపాధిని సమకూర్చుకోవాల్సిన అవసరం ఉంది, కాబట్టి వారి రోజువారీ పనులకు వెళ్లే బహిరంగ ప్రదేశంలో ఇది చాలా మటుకు జరిగి ఉండవచ్చు.

ప్రజలు వెళ్ళే, పగటిపూట వ్యాపార రోజులాగా అతను రోజుకు ఎనిమిది నుండి పన్నెండు గంటలు అలా చేసి ఉండవచ్చు అని సూచించబడింది, తద్వారా అది ఒక ప్రయోజనాన్ని అందిస్తుందని. కానీ మీరు రోజంతా ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలం ఒక వైపున పడుకోవడం ఊహించగలరా?



అయితే, యెహెజ్కేలు కష్టాలు అక్కడితో ముగియలేదు. యెహోవా అతనికి మరొకటి చేయమని ఆదేశించాడు. అతను గోధుమలు, బార్లీ / యవలు, బీన్స్ / చిక్కుడుగింజలు / కాయధాన్యములు, పప్పులు / చోళ్లు, జొన్నలు / సజ్జలు / మిల్లెట్ మరియు తెల్ల జిలకర లను తీసుకొని ఒక పాత్రలో వేసి, అతను తన ఒక వైపు పడుకోవాల్సిన రోజుల సంఖ్య ప్రకారం రొట్టెలు చేసుకోవాలి.

మూడు వందల తొంబై రోజులు అతను ఈ రొట్టె తిన్నాడు. మరియు అతను తినే భోజనం బరువు – రోజుకు సుమారు ఇరవై తులాలు (రెండు వందల గ్రాములు). వేళవేళకు తింటూండేవాడు. కొలతల ప్రకారం నీళ్లు కూడా తాగేవాడు.

ఇంకా సరిపోలేదా? ప్రజల దృష్టిలో మానవ మలమును ఉపయోగించి ఈ భోజనాన్ని కేకులుగా కాల్చమని అతనికి సూచించబడింది! పాపం యెహెజ్కేలు! అతను ఇలా తనను తాను ఎప్పుడూ అపవిత్రం చేసుకోలేదని యెహోవాతో చెప్పి నిరసించాడు, బహుశా అతను జంతువుల పేడను ఉపయోగించవచ్చా అని? మరియు యెహోవా కాల్చే మంటకు ఆవు పేడను ఉపయోగించడానికి అతన్ని అనుమతించాడు. ఇప్పుడు ఈ పద్ధతి, పేడను సేకరించి, చదును చేసి, ఆరబెట్టడం సాధారణమే, మన భారతదేశంలో దీనిని చేయడం మనం చూడగలము.

మనము ఒక్కప్పుడు బొగ్గు ను ఎలా ఉపయోగిస్తామో అదే పద్ధతిలో వారు దీనిని ఉపయోగించారు. అది ఆరిపోయిన తర్వాత ఇంటికి తీసుకెళ్తారు మరియు అది వంట ఇంధనంగా మారుతుంది. మీరు మరియు నేను దీన్ని ఆహ్లాదకరమైన పనిగా భావిస్తారని నేను అనుకోను.

ఇప్పుడు మనం దానియేలును రెండవ అధ్యాయం నుండి పరిశీలించాలనుకుంటున్నాము. ఇది కూడా దాదాపు అదే సమయంలో జరిగింది. దానియేలు బబులోను రాజధానిలో బందీలుగా ఉన్న తన ప్రజలకు యెహోవా ప్రవక్త.

దానియేలు రాజు విందుల నుండి దూరంగా ఉండటంలో చూపిన విశ్వాసం కారణంగా, అతను మరియు మేషక్, షడ్రక్ మరియు అబెద్నెగో రాజు కలలను వివరించే అవకాశం పొందారు. దానియేలు ఇలా చేసిన విషయం ను రెండవ అధ్యాయంలో మనం చదువుతాము:

**దానియేలు 2:46 – 48 "అంతట రాజగు నెబుకద్నెజరు దానియేలునకు సాష్టాంగనమస్కారము చేసి అతని పూజించి, నైవేద్య ధూపములు అతనికి సమర్పింప ఆజ్ఞాపించెను. మరియు రాజుఈ మర్మమును బయలు పరచుటకు నీవు సమర్థుడవైతివే; నీ దేవుడు దేవతలకు దేవుడును రాజులకు ప్రభువును మర్మములు బయలుపరచు వాడునై యున్నాడని దానియేలునకు ప్రత్యుత్తర మిచ్చెనుఅప్పుడు రాజు దానియేలును బహుగా హెచ్చించి, అనేక**



**గొప్ప దానములిచ్చి, అతనిని బబు లోను సంస్థానమంతటిమీద అధిపతినిగాను బబులోను జ్ఞానులందరిలో ప్రధానునిగాను నియమించెను."**

యెహోవా యొక్క ఈ ముగ్గురు వేర్వేరు ప్రవక్తలు ఒకే సమయంలో గడిపిన అనుభవాలలో ఎంతటి వైవిధ్యం! యిర్మీయా జిగట గల ఊబి లో, చీకటిలో ఉన్నాడు, తృణీకరించబడిన యెహెజ్కేలు ఒక సంవత్సరానికి పైగా ఒక ప్రక్కనే పడుకుని, ఆవు పేడతో వండిన కొద్దిపాటి రొట్టె మాత్రమే తింటున్నాడు, దానియేలు రాజభవనంలో ఉన్నత స్థానంలో ఉన్నాడు!

ముగ్గురూ దేవునికి విశ్వాసపాత్రులు. ముగ్గురూ యెహోవా చిత్తం చేస్తున్నారు,వారు దేవుని చేత శిక్షించబడలేదు.

సహోదరులారా, మీరు ఎవరిని ఎంచుకోవాల్సి వస్తే, ఎవరిని ఎంచుకుంటారు? సరే, దావీదు రాజు ఒకసారి చెప్పినట్లుగా, **"యెహోవా దృష్ఠికి అనుకూలమైన దానిని ఆయన చేయును" – 1సమూయేలు 3:18.**

ఐరోపాలోని మన సహోదరులు కమ్యూనిజం మరియు నాజీల క్రింద ఎంత భయంకరంగా బాధపడ్డారో మనం గుర్తు చేసుకోవచ్చు, అదే సమయంలో, ఉత్తర అమెరికాలోని మనకు స్వేచ్ఛ మరియు సౌకర్యం ఉండేది.

ఇది జరుగుతున్నప్పుడు, వారు దేని గుండా వెళుతున్నారో మనకు తెలియదు. మరియు ఈ రోజు కూడా, విదేశాలలో ఉన్న మన సహోదరుల అనుభవాలతో మనల్ని మనం పోల్చుకున్నప్పుడు, వారి పేదరికం మరియు వారి హింసలు మరియు వారి ఆంక్షలు, మనకు

సాధారణంగా సమృద్ధి ఉన్నప్పుడు, దీనిని ప్రపంచ స్థాయిలో ఆలోచించవచ్చు. ఇంతకు ముందెన్నడూ లేని విధంగా దేశం లేదా ప్రదేశం యొక్క ప్రస్తుత పరిస్థితులపై మనకు చాలా ఎక్కువ సమాచారం ఉంది, కాబట్టి ఒక వైపు, మంచి శారీరక లేదా తాత్కాలిక స్థితిలో ఉన్నవారు, తక్కువ స్థితిలో ఉన్నవారి గురించి నిరాశగా ఆలోచించడానికి శోదించబడవచ్చు. మరోవైపు, మరింత నిరాశపరిచే స్థితిలో ఉన్నవారు, ఇతర సహోదరులు తాత్కాలికంగా చాలా మెరుగ్గా ఉన్నందున, దేవుడు వారిని శిక్షిస్తున్నాడని భావించవచ్చు. లేదా, కొందరి విషయంలో, సహాయం చేయగలిగిన స్థోమత ఉండి కూడా సహాయం చేయకుండ, దూరంగా నివసిస్తున్న వారి గురించి దయగా ఆలోచించడం కూడా ఒక పరీక్షగా ఉండవచ్చు.

ఆత్మీయ సహోదరులకు అవసరమైన సహాయం అందించేందుకు యెహోవా అనుగ్రహించిన సంపదను/సమృద్ధిని సరైన విధంగా పంపిణీ చేయడం ఒక క్లిష్టమైన లేదా అత్యంత సవాలుతో కూడిన పని. ఎందుకంటే, వారికి సమస్యలను సృష్టించకుండా లేదా యెహోవా భరించడానికి అనుమతించిన పరిస్థితిని అనవసరంగా భంగం కలిగించకుండా సహాయం చేయడం అత్యంత అవసరం.

ఏది ఏమైనప్పటికీ, మన సహోదరులను ప్రపంచవ్యాప్తంగా దేవుని పిల్లలుగా సమానంగా భావిస్తూ, మన కోసం మనం ఆలోచించుకున్నట్లే వారి కోసం ప్రార్థనాపూర్వకంగా గుర్తు చేసుకోవడం, క్రీస్తు వంటి స్వభావంగా దేవునికి ఆమోదయోగ్యమైనదని మనం నిస్సందేహంగా నమ్మవచ్చు.

కానీ, ఈ విధమైన సరిపోల్చుకునే పరీక్ష కోసం మన సహోదరులు ఎక్కడో దూరంగా ఉండాల్సిన అవసరం లేదు. నిజానికి, మన

వ్యక్తిగత పరిస్థితులను మన చుట్టూ ఉన్నవారితో పోల్చుకోవడం ద్వారా మనల్ని మనం సవాలు చేసుకుంటాము! ఈ అంశాన్ని కొన్ని తదుపరి ఉదాహరణల ద్వారా మరింత పరిశీలించుదాము.

యిర్మీయా, యెహెజ్కేలు మరియు దానియేలు యొక్క ఈ ఉదాహరణను వదిలి వెళ్ళే ముందు, మనం మరొక పరిశీలన చేయాలనుకుంటున్నాము.

యెహెజ్కేలు 14 వ అధ్యాయంలో,దానియేలు పట్ల యెహెజ్కేలు యొక్క దృక్పథాన్ని/వైఖరిని గురించి ఒక అవగాహన పొందుతాము.

**యెహెజ్కేలు 14:14 "నోవహును దానియేలును యోబును ఈ ముగ్గురు అట్టి దేశములో నుండినను వారు తమ నీతి చేత తమ్మును మాత్రమే రక్షించుకొందురు, ఇదే ప్రభువగు యెహోవా వాక్కు."**


నిజమే, యెహోవా యెహెజ్కేలు ద్వారా మాట్లాడుతున్నాడు, కానీ యెహెజ్కేలు దానిని మనకు నమోదు చేశాడు, మరియు యెహెజ్కేలుకు ఈ భావన ఉందని నేను అనుకుంటున్నాను. అతను తన సమకాలీనులలో ఒకరైన దానియేలును నీతికి ఉదాహరణగా ఉపయోగిస్తున్నాడు. దానియేలు చాలా సౌకర్యవంతమైన మరియు వాస్తవానికి ఉన్నతమైన స్థానంలో ఉన్నట్లు కనిపిస్తున్న అదే సమయంలో, యెహెజ్కేలు ఎదుర్కొన్న తీవ్రమైన పరీక్షలు మరియు భారాలను గురించి మనం ఆలోచించినప్పుడు ఇది నిజంగా ఆశ్చర్యపరిచే విషయమే.

ఇదే మనకు ఉండాల్సిన వైఖరి. మన కష్టాలను అంగీకరించుకుంటూనే, ఇతరులు అవి అనుభవించకపోయినా వారికి గౌరవం చూపించాలి.

## రాహేలు మరియు లేయా

రాహేలు మరియు లేయాల ఉదాహరణను తీసుకుంటే ఎలా ఉంటుంది? నిస్సందేహంగా, వారు తమ కుటుంబ సభ్యుల మధ్య తారతమ్యంను అనుభవించారు.

మనకు తెలిసినట్లుగా, యాకోబు లేయాను ప్రేమించిన దానికంటే రాహేలును ఎక్కువగా ప్రేమించాడు. ఎక్కువ మంది పిల్లలను కనడం ద్వారా అతని అభిమానాన్ని పొందాలని లేయా ఆశించింది. ఆమె మొదటి బిడ్డను కన్నది. ఆ తర్వాత రాహేలు తన పోరాటాన్ని ఎదుర్కొంది, మీరు దానిని చదివితే, అది చాలా దయనీయంగా ఉంటుంది. అది వారి భర్త అయిన యాకోబు ప్రేమ కోసం జరిగిన పోటీగా మారింది.



ఎంతటి కుటుంబ పోరాటం! అది కూడా ఇద్దరు అక్కాచెల్లెళ్ళు. తరువాత కాలంలో, ఒక పురుషుడు అక్కాచెల్లెళ్ళను వివాహం చేసుకోవడం చట్టవిరుద్ధమైంది.

కానీ ఇదిగో, ఒక కుటుంబంలో సరిపోల్చుకునే ఈ పరీక్షను మనం చూడగలిగేలా ఈ పరిస్థితి మన కోసం లిఖించబడింది మరియు ఈ రకమైన అంతర్గత కుటుంబ పోలికలు ఇప్పటికీ కొనసాగుతాయని మేము సూచిస్తున్నాము, ఒకే భర్తను వివాహం చేసుకున్న అక్కాచెల్లెళ్ల మధ్యనే కాకుండా, ఏ సోదరి కుటుంబం పెద్దది లేదా మరొకదాని కంటే మెరుగ్గా ఉందనే ఇతర సంబంధిత అంశాల రూపంలో పరీక్షలు ఉంటాయి. ఇది సోదరులను కూడా సమానంగా ప్రభావితం చేస్తుంది.

## 3 + 9 అపొస్తలులు

ముగ్గురు అపొస్తలులైన యాకోబు, యోహాను, మరియు పేతురు లకు, మిగిలిన తొమ్మిది మందితో సరిపోల్చుకునే పరీక్షను ఎదుర్కొన్నారు. ఎందుకంటే, వారు కొన్ని సందర్భాలలో ప్రత్యేకమైన ప్రాధాన్యతను పొందారు. ఉదాహరణగా, రూపాంతర పర్వతంపై మరియు గేత్సేమనే తోటలో, వారు మిగిలిన తొమ్మిది మందికి వేరు గా ప్రత్యేక అనుభవాలను పొందారు.

ఇప్పుడు, మిగిలిన తొమ్మిది మంది దీనిని ఒక పరీక్షగా అనుభవించారనే విషయం నమోదు చేయబడలేదు. అయితే,



తొమ్మిది మంది విస్మరించబడినట్లు భావించడానికి అవకాశం ఉంది.

ఎలా ఈ ముగ్గురు ప్రత్యేకమైన ప్రాధాన్యత ను పొందారు? రీప్రింట్ 4649 లో సోదరుడు రస్సెల్, వీరు యేసు ప్రియమైన శిష్యులని సూచిస్తారు. అలాగే, **రీప్రింట్ 3345**లో, వారు విశ్వాసం మరియు వైరాగ్యం లో అత్యంత అభివృద్ధి చెందినవారు కాబట్టి ఈ ప్రాధాన్యత దక్కిందని సూచిస్తున్నారు.

దీనిని పరిగణనలోకి తీసుకుంటే, మనకు ఏమాత్రం పరీక్ష ఉండొచ్చు? ఈ సరిపోల్చుకునే పరీక్ష అనేది, మనలోని కొందరు సహోదరులు మన కంటే ఎక్కువ సేవా ప్రాధాన్యతను పొందుతారు. దాన్ని మనం అసూయపడతామా? అలా అసలు చేయకూడదు. ప్రభువు తన ప్రజలైన ప్రతి ఒక్కరితో ఒక్కొక్క రీతిలో ప్రత్యేకంగా వ్యవహరిస్తున్నారు.

ఇదే కారణంగా ప్రభువు మనకు రెండు ఉపమానాలను ఇచ్చాడు. 'పది మినాలు' అనే ఉపమానంలో, ప్రతి దాసుడికి సమానమైన మొత్తాన్ని ఇచ్చారు (ఇది సమాన న్యాయస్థితిని సూచిస్తుంది), కానీ, ఆ బాధ్యతను వారు తమ జీవితంలో ఎలా నిర్వర్తించారు? వారు ప్రభువుకు ఎలా ప్రత్యేకంగా సేవ చేశారు? అలాగే, 'తలాంతులు' అనే ఉపమానంలో, ప్రతి దాసుడికి విభిన్న స్థాయిలో తలాంతులు ఇవ్వబడ్డాయి. అయితే, వారు తమ జీవితకాలంలో వాటిని ఎలా ఉపయోగించారు? ఈ రెండు ఉపమానాలలో మనకు ప్రధాన పాఠం ఏమిటంటే, మనమందరం ఒకే ప్రభువుకు దాసులమని, కానీ ప్రతి ఒక్కరూ భిన్నంగా ఉంటామని, అందువల్ల, మనకు లభించే అవకాశాలను అనుసరించి మనం సేవ చేయాలి – అదే సమయంలో, మనం గుర్తుంచుకోవలసిందేమంటే, మన ప్రయత్నాల ఫలితంగా ఎక్కువ అవకాశాలు మన వద్దకు వస్తాయి.

మరియు ఇది మన ప్రభువైన యేసు తన భూసంబంధమైన పరిచర్యలో ఈ ముగ్గురిని వారు చేయవలసిన కొన్ని ప్రత్యేక పనుల కోసం ఎలా ఆశీర్వదించాడో ప్రతిబింబిస్తుంది. మరియు మిగిలిన తొమ్మిది మంది, ఈ ముగ్గురి ప్రాముఖ్యతను అసూయగా భావించకుండా, తాము ప్రత్యేకమైన ప్రాముఖ్యతను పొందారని గుర్తించారు. వారు ఈ ముగ్గురి జీవితాన్ని పరిశీలించి, 'ఆ ముగ్గురు ఏం చేస్తున్నారు? నేను ఇంకా ఏ విధంగా మెరుగుపడగలను? అని ఆలోచించాలి మరియు వారిని ఆరోగ్యకరమైన రీతిలో సరిపోల్చుట ఒక మంచి ఆదర్శంగా లేదా స్ఫూర్తిదాయకమైన ఉదాహరణగా చూడాలి.

అయితే, ఈ ముగ్గురి కోసం, సరిపోల్చుకునే పరీక్ష వారి గర్వభావాన్ని పెంచే అవకాశం కూడా కావచ్చు.వారు నిజంగా అలా ప్రవర్తించారని మనం అనుకోవడం లేదు, కానీ ఆ అవకాశం ఉందనే చెప్పాలి. వారు 'మేము మా ఇతర సహోదరుల కంటే విశేషమైనవారమా?' అనే భావనకు లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. అయితే, వారు ఈ విషయంలో సమతుల్యతను సాధించారని భావించగలము. ఈ విధంగా చూసినప్పుడు, సరిపోల్చుకునే పరీక్ష రెండు మార్గాల్లోనూ ప్రభావితం చేయగలదు.

## ధనవంతుడైన యువకుడు మరియు పేతురు

ఒక ధనవంతుడైన యువకుడు యేసు వద్దకు వచ్చాడు. అతను శిష్యరికం గురించి అడిగినప్పుడు, యేసు నీకున్నదంతా అమ్మి పేదలకు పంచి నన్ను వెంబడించు అని చెప్పాడు. అయితే, అతనికి

అపారమైన సంపద ఉండటంతో, అవి వదులుకోవడానికి ఇష్టపడక, దుఃఖంతో వెళ్లిపోయాడు.

పేతురు ప్రతిస్పందనను మనం గుర్తుచేసుకుంటే – మేము ప్రభువు కోసం అన్నింటినీ వదులుకున్నాము. అప్పుడు మాకు ఏమి దక్కుతుంది? ఇది స్పష్టంగా ఒక సరిపోల్చుకునే పరీక్ష. పేతురు తన పరిస్థితిని ఇతరులతో పోల్చుకుంటూ, ఈ పరీక్షను ఎదుర్కొన్నాడు.

వారు త్యాగం చేసిన వాటిని, ఈ భూసంబంధమైన విషయాలను పేతురు పోల్చి చూస్తూ, మాకు ఏమి దక్కుతుంది? అని ప్రశ్నిస్తున్నాడు. దీనికి యేసు సంక్షేప సమాధానం ఏమిటంటే, ఈ జీవితకాలంలో మీకు ఆధ్యాత్మిక ఆశీర్వాదాలు ఉంటాయి, మీ తాత్కాలిక అవసరాలు తీర్చబడతాయి మరియు మీరు నన్ను విశ్వాసంగా అనుసరిస్తే, పరలోకంలో అపారమైన నిధిని సంపాదించుకుంటారు.


సహోదరులారా, మనం మన చుట్టూ చూస్తున్నప్పుడు, పని చేసే ప్రదేశంలో మరియు మన కుటుంబాలలో లేదా పొరుగువారిలో, సహజమైన మార్గాల్లో మనం అభివృద్ధి చేసుకోవలసిన వైఖరి ఇది. పేతురుకు యేసు ఇచ్చిన సమాధానాన్ని, అదేవిధంగా మనందరికీ వర్తించే సమాధానాన్ని మనం గుర్తుంచుకుంటున్నామా? – మన నూతన సృష్టి, త్యజించిన వాటికంటే ప్రభువు వాగ్దానం చేసిన బహుమతులపై ఎక్కువ విలువను ఉంచుతోందా?

కానీ మన అవసరాలు తీర్చబడుతాయనే వాగ్దానం కూడా మనకు ఉంది. ప్రపంచంలోని వారు లేదా ఇతర సహోదరులు కలిగి ఉండే సమృద్ధితో పోల్చినప్పుడు, మనకు లభించిన దానితో మనం సంతృప్తి చెందుతున్నామా?

## జెబెదయి కుమారులైన యాకోబు మరియు యోహాను

జెబెదయి కుమారులైన యాకోబు మరియు యోహాను మధ్య వీలుపడిన సరిపోల్చుకునే పరీక్ష గురించి ఏమంటారు? ఇద్దరూ అపొస్తలులే, మరియు యాకోబు పెద్దవాడై ఉండవచ్చని, యోహాను చిన్నవాడై ఉండవచ్చని చూడగలము.

ఇక్కడ సరిపోల్చుకునే పరీక్ష ఏమిటంటే, యాకోబు మరణించిన మొదటి అపొస్తలుడు కాగా, యోహాను చివరి అపొస్తలుడు. యాకోబు బహుశా 15 సంవత్సరాల బల్యార్పణ జీవితం తర్వాత మరణించాడు, యోహాను 65 సంవత్సరాల బల్యార్పణ జీవితం తర్వాత మరణించాడు. యోహాను, నేను ఈ శరీరంలో ఇంతకాలం ఎందుకు ఉండాలి? నేను ఏదైనా సరిగ్గా చేయడం లేదా? నేను సరిగ్గా అభివృద్ధి చెందడం లేదా? నేను అవసరమైన అనుభవాలను నేర్చుకోవడం లేదా? అని తనను తాను ప్రశ్నించుకుని ఉండవచ్చు.



ఈ ప్రశ్నకు సమాధానం ఎంతో సులభంగా ఉండవచ్చు – ప్రభువు యోహాను ద్వారా చేయించాల్సిన పని ఉంది. అందుకే యాకోబు కంటే ఎక్కువ కాలం యోహాను భూమిపై జీవించాల్సి

వచ్చింది, 12 మంది అపొస్తలులు మరణించేలోపు, ప్రారంభ దశలో ఉన్న సంఘాన్ని స్థిరపరచడానికి ప్రభువుకు యోహాను అవసరం అయ్యాడు.

నిజానికి, మనకు ముందు నుండి ఉన్న ప్రియ సహోదరులు తమ వయస్సులోని ఇతర సహోదరులు వెళ్లిపోయినప్పుడు తాము ఇంకా ఇక్కడే ఎందుకు ఉన్నామని ప్రశ్నించడం మనం వింటూ ఉంటాము.

కొన్నిసార్లు అది జీవించి ఉన్న జీవిత భాగస్వామి కావచ్చు, మరికొన్ని సార్లు తల్లిదండ్రుల కంటే ముందే వయసు వచ్చిన సంతానం మరణించవచ్చు, మరికొన్ని సార్లు కలిసి బాప్తిస్మం తీసుకున్న సమూహంలో ఒకరు మరణించవచ్చు.

మనమంతా ప్రతి విషయం ను ప్రభువుకు వదిలివేయాలని గుర్తుంచుకోవడం మంచిది, **"వెలుగులో ఒంటరిగా వెళ్ళడం కంటే ప్రభువుతో చీకటిలో వెళ్ళడం ఉత్తమం."**

## పదకొండవ గంట కూలీలు

కూలి ఉపమానం (మత్తయి 20:1-16) లోని పాఠాన్ని తీసుకోండి. ప్రభువు ద్రాక్షతోటలో ఎక్కువసేపు పనిచేసిన వారు, తక్కువ సమయం పనిచేసిన వారు అదే పారితోషికాన్ని పొందినప్పుడు సణుగుకున్నారు.ఒకవేళ ఇది సాధారణ వ్యాపార వ్యవహారం అయితే వారి అభ్యంతరాన్ని అర్థం చేసుకోవడం సులభమే. కానీ అది కాదు. ఈ ఉపమానం మన ప్రభువుకు సేవ చేసే శిష్యుడు ఎంత కాలం పనిచేసినా, అదే ప్రతిఫలం పొందటాన్ని సంతృప్తిగా స్వీకరించాలని నేర్పుతుంది. అంతేకాక, ఇంకా ఎక్కువ కాలం శరీరంలో ఉండి

ఆయనకు సేవ చేసే అవకాశం లభించినందుకు ఆనందించాలనే ముఖ్యమైన పాఠాన్ని కూడా అందిస్తుంది.

**కొత్తగా లేదా యువకులుగా సత్యంలో వచ్చినవారు సమానమైనా లేదా మరింత ఎక్కువ సేవా అవకాశాలను పొందినప్పుడు, మనలో ఎవరూ దానిని తృణీకరించకూడదు లేదా అసూయ పడకూడదు.**

## లూసిఫర్ మరియు లోగోస్

యెషయా 14:12-15 లో, లూసిఫర్ తన మనస్సులో తనను తాను సర్వోన్నతుడైన దేవునితో సమానం చేసుకోవాలని అనుకున్నాడు. దేవునితో తనను పోల్చుకోవడం ఊహించగలమా? తద్వారా అతని పతనానికి దారితీసింది. అతను గర్వంతో నిండి, విఫలమయ్యాడు. దీనికి భిన్నంగా, ఫిలిప్పీయులు 2:5-10 లో, యేసు, లోగోస్ గా, దేవునిలా కాకుండా ఆత్మ సంబంధమైన స్వభావం కలిగి ఉన్నాడని పౌలు చెబుతున్నాడు. యెహోవా దైవిక స్వభావం కలిగి ఉన్నప్పుడు, యేసు తనను తాను దేవునితో సమానం చేసుకోవాలని ప్రయత్నించలేదు. లూసిఫర్ కు భిన్నంగా, యేసు తనకూ, పరలోకపు తండ్రికీ ఉన్న తేడాను చూసి, వినయంగా అంగీకరించి దాన్ని స్వీకరించాడు.

కాబట్టి, సరిపోల్చుకునే పరీక్ష మానవ కుటుంబానికి మాత్రమే పరిమితం కాదు.

## యూస్తు మరియు మత్తీయ

యూస్తు అను మారుపేరు గల బర్సబ్బా అనబడిన యోసేపు, మత్తీయ అను ఇద్దరిని గురించి ఆలోచిద్దాం. ఇస్కారియోతు యూదా

తన అపొస్తలిక స్థానం కోల్పోయినప్పుడు, పదకొండు మంది అపొస్తలులు అతని స్థానాన్ని భర్తీ చేయాలని ఆలోచించారు మరియు వారు యూస్తు అను మారుపేరు గల బర్సబ్బా అనబడిన యోసేపు, మత్తీయ ల మధ్య చీటి తీసి, మత్తీయాను పన్నెండు మంది అపొస్తలుల్లో ఒకరిగా ఎన్నుకున్నారు. అయితే, ఇది నిజంగా అలా జరగలేదు, ఎందుకంటే ప్రభువు స్వయంగా తన పన్నెండు అపొస్తలులను ఎన్నుకున్నాడు, మరియు తరువాత పౌలును ప్రత్యేకంగా ఎన్నుకున్నాడు, అయినప్పటికీ ఇది వారి మధ్య ఎంత పెద్ద సరిపోల్చుకునే పరీక్ష ఉన్నదో మనం ఆశ్చర్యపోవచ్చు. యూస్తు ఎంపిక కాలేదు కాబట్టి తన మనసులో ఎన్నో ఆలోచనలు మెదిలి ఉండవచ్చు, అయితే, ప్రభువు తనను అంగీకరించకుండా పౌలును ఎన్నుకున్నాడని మత్తీయ గ్రహించిన తర్వాత, అతని మనసులో చెలరేగిన సరిపోల్చుకునే పరీక్షతో పోలిస్తే, యూస్తు అనుభవించినది ఏమీ కాదు.

నిస్సందేహంగా, యూస్తు మరియు మత్తీయాలు ప్రభువు నిర్దేశానికి వినయంగా అంగీకరించే మధురమైన వైఖరిని కలిగి ఉన్నారని మనం ఆశించి, విశ్వసించవచ్చు. అదే వైఖరి మనకు కూడా అవసరం. మనం ఏక్లేసియా/సంఘం లో ఎన్నికైన సేవకులము కాకపోయినప్పటికీ, మన సహోదరులు ఎన్నికైనప్పుడు, మనం దానిని వినమ్రంగా అంగీకరించగలమా?

ఒకే విధంగా సేవలో భాగస్వాములమైనా, కొందరికి మరింత ప్రధానమైన సేవా ప్రాముఖ్యత మరియు అవకాశాలు ఉంటే? అది మనకు పరీక్షే.

## పేతురు మరియు పౌలు

గలతీయులు 2 వ అధ్యాయం లో పేతురు మరియు పౌలు సిద్ధాంతంపై

ముఖాముఖిగా నిలబడటం గురించి ఏమంటారు? పోలిక ప్రకారం పౌలు కొత్తవాడు. ఇంతకు ముందు పౌలు సంఘాన్ని హింసించినవాడు. ఇక్కడ, పేతురుకు స్వర్గపు ద్వారాలు తెరిచే అధికారం, యూదులకు మరియు అన్యజనులకు, క్రీస్తు సంఘానికి ఉన్నత పిలుపును ఇవ్వడానికి తాళాలు ఇవ్వబడ్డాయి. అయినప్పటికీ, అన్యజనులపై యూదుల ప్రభావానికి సంబంధించిన ఈ చర్చలో ఎవరు సరిగ్గా ఉన్నారు? పౌలు సరిగ్గా ఉన్నాడు. ఇద్దరు అపొస్తలుల మధ్య సిద్ధాంతపరమైన చర్చ జరిగింది. మరియు పేతురుతో పోలిస్తే కొత్తవాడైన పౌలు చెప్పిందే సరైనది.

పేతురు ఈ సరిపోల్చుకునే పరీక్షలో ఎలాంటి వైఖరిని ప్రదర్శించాడు? 2 పేతురు 3:15, 16 లో, పేతురు "మన ప్రియ సహోదరుడైన పౌలు" అని సంబోధిస్తూ, పౌలు తన లేఖలలో లోతైన విషయాలు రాశాడని వినయంగా ఒప్పుకుంటూ, కొన్ని విషయాలు చాలా అత్యంత లోతైనవి కాబట్టి అర్థం చేసుకోవడం కష్టమైనవని పేర్కొన్నాడు. పేతురు, పౌలు యొక్క సిద్ధాంతపరమైన సామర్థ్యాలను మరియు లోతైన జ్ఞానాన్ని ఆమోదిస్తున్నాడు. ఈ విధంగా, పేతురు ఈ



సరిపోల్చుకునే పరీక్షను విజయవంతంగా ఎదుర్కొని, సరైన మనోభావంతో దీన్ని అధిగమించాడు.

## సేవకులు మరియు యజమానులు

ఆదిమ సంఘంలో సేవకులకు మరియు యజమానులకు మధ్య ఎంతటి పరీక్ష జరిగి ఉంటుందో కదా! నేను తరచుగా దీని గురించి ఆశ్చర్యపడుతూ ఉంటాను, మరియు మీరు కూడా అని అనుకుంటున్నాను. పౌలు మూడు వేర్వేరు ప్రదేశాలలో సేవకులుగా ఉన్న సహోదరులకు వ్రాస్తాడు, గ్రీకులో, ఆ పదం బానిసలు (slaves). అతను బానిసలకు వ్రాశాడు, ఆపై అతను యజమానులకు వ్రాశాడు.

ఇద్దరూ క్రైస్తవ విశ్వాసులే, కానీ అతను యజమానులకు, మీ బానిసలందరినీ విడిపించండి అని వ్రాయలేదని, లేదా బానిసలకు, మీ స్వేచ్ఛ కోసం మీ యజమానులందరినీ ధిక్కరించండి అని వ్రాయలేదని మనం గమనించవచ్చు.



బదులుగా, అతను వారి బాధ్యతలో మరియు వారి విభిన్న స్థానాలలో క్రైస్తవులుగా వ్యవహరించమని వారిద్దరికీ వ్రాస్తాడు. సహోదరులారా, క్రైస్తవ యజమానికి బానిసగా ఉండడం సరిపోల్చుకునే పరీక్షలో ఎంత కష్టంగా ఉండి ఉంటుందో కదా!

మనం మన జీవితంలో విభిన్న అనుభవాల్లో దాస్యస్థితిలో ఉన్నట్టు అనిపించవచ్చా? మన జీవిత భాగస్వామి దేవునికి అంకితం కాలేదనే పరీక్షకు మనం బందీలమై ఉన్నామా? భారమైన బాధ్యతలు మనపై ఉండి, మనం కోరుకున్నట్లుగా ప్రయాణించడానికి లేదా సహోదరులను ఆహ్వానించడానికి స్వేచ్ఛను పరిమితం చేసే బాధ్యతలకు మనం బానిసలమా? మన సహోదరులు అనుకున్నట్లు ఎప్పుడైనా ప్రయాణించే స్వేచ్ఛ, అనుకున్నట్లుగా సహోదరుల సహవాసం ఉండగా, కోరుకున్న అన్ని సమావేశాలకు వెళ్లడానికి స్వేచ్ఛను కలిగి ఉండటం చూసినప్పుడు, కార్యాలయంలో ఏదో ఒక రకమైన పరిస్థితికి మనం బానిసలుగా, అది మనల్ని సమావేశాలకు వెళ్ళకుండా అడ్డుకుంటున్నాయా? ఇది సరిపోల్చుకునే పరీక్ష కావచ్చు.

## ఆరోగ్యం విషయంలో పరీక్ష

అలాగే ఆరోగ్యం విషయంలోనూ పరీక్షలు ఎదురవుతాయి. అపొస్తలుల కార్యములు 19:12 ప్రకారం, పౌలు శరీరమునకు తగిలిన చేతి గుడ్డలైనను నడికట్లయినను రోగులయొద్దకు తెచ్చినప్పుడు రోగములు వారిని విడిచెనని చూడగలము. అయితే, 2 కోరింథీయులకు 12వ అధ్యాయంలో పౌలు తన శరీరంలో ఉన్న ముల్లు తొలగించమని మూడు సార్లు ప్రభువును ప్రార్థించాడు. ప్రభువు మహిమను చూచినప్పుడు పౌలు తన చూపును కోల్పోయాడు, అతనికి తిరిగి చూపు రావడానికి ఒక అద్భుతం

అవసరమైంది. ఇది అతనికి శరీరంలో ఒక ముల్లు మరియు అతని అనుభవాలలో ఒక పరీక్ష, అది ప్రభువు చిత్తమైతే దానిని తొలగించమని అతను ప్రార్థించాడు.


కానీ అది ప్రభువు చిత్తం కాదు. పౌలు తన బలహీనమైన ఆరోగ్యాన్ని సహిస్తూ, వినయంగా దేవునికి లోబడాలని ప్రభువు కోరుకున్నాడు. అలా లోబడటం ద్వారా, పౌలు తనలో మరియు తన ద్వారా దేవుని గొప్ప శక్తి పని చేస్తున్నట్లు చూపించాడు. పౌలు చూపిన ఈ వినయం, మనందరికీ, ఎల్లప్పుడూ ఒక ఆదర్శంగా నిలుస్తుంది.

మన ఆరోగ్య సమస్యలను ఇతరులతో పోల్చుకుంటున్నామా? మనకు ఆరోగ్యం సరిగా లేక అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైనప్పుడు లేదా మన రోగాలను, వైకల్యాలను భరిస్తున్నప్పుడు, "ప్రభువా, ఇతరులకు మంచి ఆరోగ్యం ఉండి, దానివల్ల వాళ్ళు ఆధ్యాత్మికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నారు, మరి నాకు ఎందుకు ఇలా జరిగింది?" అని అడిగే ధోరణి ఉండవచ్చు.

సహోదరులారా, ఇది సులభంగా తీవ్రమైన శోధనగా మారవచ్చు మరియు చాలా మందికి సాధారణంగా ఎదురయ్యేదే. అయితే, మనం పౌలుని చూడగలము – అతను ఇతరులను స్వస్థపరచినప్పటికీ, తనను తాను స్వస్థపరచుకునేందుకు ఆ శక్తిని ఉపయోగించలేదు. అతను ఈ విషయంలో ప్రభువును వేడుకున్నప్పుడు, "నా కృప నీకు చాలు" అని సమాధానం వచ్చింది. అతనికి ఆ శోధన తొలగిపోలేదు, కానీ దాన్ని భరించేందుకు ప్రభువు దయ చూపాడు.

## అది నీకు ఎందుకు?

ఇప్పుడు మనం యోహాను 21:18-22 చదువుదాము. "యేసు నా గొఱ్ఱెలను మేపుము. నీవు ,యవ్వనుడవై యుండినప్పుడు నీ అంతట నీవే నడుము కట్టుకొని నీకిష్టమైన చోటికి వెళ్లుచుంటివి; నీవు ముసలివాడవైనప్పుడు నీ చేతులు నీవు చాచుదువు, వేరొకడు నీ నడుము కట్టి నీకిష్టము కాని చోటికి నిన్ను మోసికొని పోవునని నీతో నిశ్చయముగా చెప్పుచున్నానని అతనితో చెప్పెను. అతడు ఎట్టి మరణము వలన దేవుని మహిమపరచునో దాని సూచించి ఆయన ఈ మాట చెప్పెను. ఇట్లు చెప్పి నన్ను వెంబడించుమని అతనితో అనెను. పేతురు వెనుకకు తిరిగి, యేసు ప్రేమించిన వాడును, భోజనపంక్తిని ఆయన రొమ్మున ఆనుకొని ప్రభువా, నిన్ను అప్పగించువాడెవడని అడిగిన వాడునైన శిష్యుడు తమ వెంట వచ్చుట చూచెను. పేతురు అతనిని చూచి ప్రభువా, యితని సంగతి ఏమగునని యేసును అడిగెను. యేసు నేను వచ్చువరకు అతడుండుట నాకిష్టమైతే **అది నీకేమి? నీవు నన్ను వెంబడించుమనెను.**"



ఆ ఉదయం గలిలయ సముద్ర తీరంలో ఈ సన్నివేశం చోటుచేసుకుంది. పేతురు మూడుసార్లు మందలింపులు పొంది, చివరకు ప్రభువుతో సమాధానపడ్డాడు. కానీ యేసు పేతురుకు తరువాతి రోజులలో ఏమి జరుగుతుందో దాని గురించి ఒక ప్రవచనం చెప్పాడు.

అది ఆహ్లాదకరమైన విషయం కాదు. పేతురు ముసలివాడవుతాడు, ఖైదు చేయబడతాడు మరియు హింసాత్మక మరణాన్ని ఎదుర్కొంటాడు. అయితే, ఆ మరణం దేవునికి మహిమను తేవడమే కాకుండా, అతను చివరి వరకు విశ్వాసంగా నిలిచి ఉండబోతున్నాడని చూపిస్తుంది.

మనము గుర్తుంచుకోవలసినది ఏమిటంటే, పేతురు మరియు మిగతా శిష్యులు అప్పటికీ పరిశుద్ధాత్మను పొందలేదు. అందువల్ల, పేతురు, తన సహజ స్వభావం ప్రకారం, తొందరపాటుకు గురవుతూ యేసు తనపై చూపిన దృష్టిని యోహాను వైపుకు మళ్లించాలని ప్రయత్నించాడు. అయితే, యేసు ఆ దృష్టిని మరల్చనీయలేదు. పాతుకుపోయిన ఆలోచనలకు లోబడకుండా, పేతురుకు, అలాగే మన అందరికీ, ఒక **గొప్ప జీవన పాఠాన్ని నేర్పాడు** – మనం మన అనుభవాలను మన సహోదరుల అనుభవాలతో లేదా మరెవరితోనైనా పోల్చకూడదు, బదులుగా **మనం యేసును అనుసరించడంపై దృష్టిపెట్టాలి.**

ఇప్పుడు, మనం రీప్రింట్ 4184 నుండి దీని గురించి చూస్తే – "**అది నీకు ఎందుకు? నన్ను వెంబడించుము**" అనే ఉప-శీర్షిక క్రింద చాలా అద్భుతంగా ఉంది.

"ఈ పాఠాన్ని ప్రభువు అనుసరించే వారందరూ నేర్చుకోవడం

క్లిష్టమైనదే అయినా, ఇది అత్యంత ముఖ్యమైనది. మనం మన చుట్టూ చూస్తూ, ఇతర శిష్యులకు మన కన్నా తక్కువ శిక్షలు, పరీక్షలు లేదా కష్టాలు రావడం గమనించి, ఆలోచిస్తే – మరియు ఆపై ప్రభువు జ్ఞానం మరియు ఆయన దైవిక సంరక్షణ ను న్యాయస్థానం చేయడానికి మనలను అనుమతిస్తే – దాని ఫలితాలు మనకు హానికరంగా ఉంటాయి. అది మన శాంతిని హరించేస్తుంది, మన విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది, మరియు రాజ్యానికి మనం సిద్ధమవ్వటానికి అవసరమైన పాఠాలను నేర్చుకోవడాన్ని ఆటంకపరుస్తుంది. ఏదైనా సమయంలో దైవిక సంరక్షణ ను విమర్శించే ఆలోచనలు మన మనస్సులోకి వస్తే, మనం తక్షణమే మన మనస్సులోనే మనకు సమాధానం చెప్పుకోవాలి – ప్రభువు పేతురుకు చెప్పిన మాటలను మనకు వర్తింపజేసుకుంటూ: 'అది నీకు ఎందుకు? నన్ను వెంబడించుము.' ఈ విషయాలను నియంత్రించడానికి మనం అనర్హులు. మరియు మాస్టర్ తన అన్ని ప్రణాళికలు మరియు లక్ష్యాలను మనకు వివరించాల్సిన అవసరం లేదు. మన విశ్వాసం, సమర్పణ మరియు నమ్మకాన్ని అభివృద్ధి చేయడం మనకు చాలా మంచిది, ఎందుకంటే ఇద్దరు వ్యక్తులు ఒకే రకమైన స్వభావాన్ని కలిగి ఉండరు. కాబట్టి, ప్రభువు చేతిలో శిక్షణ కూడా ఒక్కొక్కరికి భిన్నంగా ఉంటుంది. మన ప్రభువు జ్ఞానములో మరియు ప్రేమయందు మన విశ్వాసాన్ని ప్రదర్శిద్దాం. మన కష్టాలు ఎంత ఎక్కువగా ఉంటాయో, ఆయన కృప కూడా అందుకు తగినట్లుగానే సమృద్ధిగా ఉంటుంది. ప్రభువు పౌలుకు చెప్పినట్లుగా మనకు కూడా చెబుతాడు: 'నా కృప నీకు చాలు. నీ బలహీనతలోనే నా శక్తి పరిపూర్ణమగును.'"

నిజంగా, ఇది ప్రభువును అనుసరించిన అనుభవజ్ఞుడైన శిష్యుడి

నుండి వచ్చిన విలువైన లేదా జ్ఞానయుక్తమైన సలహా.

"పోలికలు అసహ్యకరమైనవి" అనేది ఒక సాధారణ సామెత. అంటే, వాటి ద్వారా మంచి రావడం చాలా అరుదు.

బహుశా, ప్రియమైన పేతురు ఆ ఉదయం తీరంలో ప్రభువుతో తన బంధం (శిష్యరికం) గురించి అభద్రతా భావంతో పోరాడుతున్నాడు. కొన్నిసార్లు మనం కూడా అలాంటి పోరాటాన్ని కలిగి ఉండవచ్చు. ఇది సులభంగా మనల్ని ఇతరులతో పోల్చుకునేలా చేస్తుంది. సహోదరుడు రస్సెల్ 6 వ వాల్యూమ్/సంపుటం లో మనకు "విభిన్న స్వభావాలు" ఉన్నాయని వ్రాశారు. మనలో కొంతమందికి ఎక్కువ ఆత్మవిశ్వాసం ఉంటే ఈ పోరాటం అంతగా ఉండకపోవచ్చు, అయితే మనలో మరికొందరికి తగినంత విశ్వాసం లేదు, అందువల్ల కొన్నిసార్లు ప్రభువుతో వారి సంబంధం ఇతరుల కంటే తక్కువగా ఉందని భావిస్తారు. యేసు పేతురుకు నేర్పిన పాఠం మనందరికీ వర్తిస్తుంది – అది నీకు ఎందుకు? **నన్ను వెంబడించుము.!**

## ప్రభువు మనలను ఇతరులతో సరిపోల్చుట లేదు.

మన పురోగతిని లేదా మన ఆత్మీయ స్థితిని కొలవడానికి లేదా లెక్కించడానికి ఒక కొలమానాన్ని లేదా ప్రమాణాన్ని కలిగి ఉండటానికి ప్రయత్నించడం చాలా సాధారణం. అయితే, మనం పడిపోయిన తోటి మానవులతో మనల్ని మనం కొలవడానికి లేదా పోల్చడానికి ప్రమాణంగా చేసుకుంటే, ఒక క్రైస్తవుడిగా అది అనుసరించదగిన కొలమానం కాదు! మనకు ఒక నిజమైన ప్రమాణం ఉంది మరియు అది దేవుని వాక్యంలో కనుగొనబడింది. అది ఆయన కుమారుడైన యేసులో ఉదాహరించబడింది. యేసు పేతురుతో చెప్పినట్లు, **నన్ను వెంబడించుము.**

మన సహోదరులను మంచి ఆదర్శంగా చూడవచ్చు, కానీ వారితో పోలిక చేయకుండా జాగ్రత్త వహించాలి. మన మధ్య అనేక భిన్నమైన అంశాలు ఉంటాయి, వాటిలో చాలా వరకు మనకు ఎప్పటికీ తెలియనివే. అయితే, మన పరిమితులు, పరిస్థితులు, వ్యక్తిగత స్వభావాలు, మనలను సులభంగా చుట్టుముట్టే పాపాలు, భిన్నమైన బాధ్యతలు, ప్రత్యేకమైన ప్రతిభలు మరియు అనేక విషయాల గురించి కేవలం మన పరలోకపు తండ్రికి మాత్రమే తెలుసు.

1 కొరింథీయులు 11:1 లో, 'నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారము మీరును నన్ను పోలి నడుచుకొనుడి.' అని పౌలు చెబుతాడు. ఫిలిప్పీయులు 3:17 మరియు 1 తిమోతి 4:12 లో కూడా ఇలాంటి భావనను వ్యక్తం చేశారు. అవును, ఇతరులు క్రీస్తును ఎలా అనుసరిస్తున్నారో మనం గమనించడం తద్వారా ఆ మంచి ఉదాహరణను అనుసరించడం మంచిది. అయితే, నిస్సందేహంగా పౌలు



చెబుతున్న సందేశం కేవలం ఆయనను అనుసరించడం మాత్రమే కాదు – ఆయన జీవనశైలిని పరిశీలించి, మనం కూడా ఏ విధంగా సమయాన్ని, ప్రతిభను త్యాగంగా అర్పించి, మన బల్యార్పణ ప్రతిజ్ఞను నిలబెట్టుకోవచ్చు, మన పరిశుద్ధతలో మరింతగా లోతుగా ప్రవేశించవచ్చు అనే దానిపై శ్రద్ధ పెట్టాలని సూచిస్తున్నాడు.

## మనలో ప్రతి ఒక్కరూ ఒక ప్రత్యేక సృష్టి

సహోదరులారా, మనలో ప్రతి ఒక్కరూ దేవుని చేతిలో ఒక ప్రత్యేక సృష్టి. ఆయన మనలో పని చేస్తూ, క్రీస్తు యేసులో ఆత్మీయ అభివృద్ధికి తీసుకువెళ్తూ, ఆ రహస్యమైన క్రీస్తు శరీరంలోని 1,44,000 మంది మధ్య ప్రత్యేక స్థానానికి సిద్ధం చేస్తున్నాడు. మనం చూడలేని, ఊహించలేని ఆ స్థానం కోసం ఆయన మనలను చెక్కి, మలచి, తీర్చిదిద్దుతున్నాడు. అదంతా మనకు తెలియకపోయినా, ఆయన దృష్టిలో స్పష్టంగా ఉంది.

పౌలు మన క్రైస్తవ సంబంధాలను వివరించేందుకు మానవ శరీరాన్ని ఉదాహరణగా ఉపయోగించిన తీరు అద్భుతమైనది! మనం పరస్పరం సరిపోల్చుకునే పరీక్షల నుండి విముక్తి పొందడానికి ఇది ఉత్తమ మార్గంగా అనిపిస్తుంది. ఆయన (1 కొరింథీయులకు 12 వ అధ్యాయంలో) వివరించినట్లుగా, ఆత్మజనితులైన వారందరూ సూచనగా, రహస్యమైన క్రీస్తు శరీరంలోని భాగాలుగా ఉంటారు. ఆ శరీరానికి క్రీస్తు తలగా ఉన్నాడు. మానవ శరీరం అన్ని అవయవాలను సమన్వయం చేసుకున్నట్లే, ఆయన వ్యక్తిగతంగా మరియు సమష్టిగా శరీరంలోని ప్రతి ఇతర సభ్యునికి దిశానిర్దేశం చేస్తాడు.

**పౌలు, శరీరంలోని చేతి భాగం తాను ఇతర శరీర అవయవాల కంటే ఎక్కువ లేదా తక్కువ ముఖ్యమైనదని భావించకూడదని చెబుతున్నాడు. అంతేకాక, ఒక శరీర భాగం చేయగలిగే పని మరొక భాగం చేయలేకపోవచ్చు. ఈ విధంగా, మనం పరస్పరం ఒకరికొకరు తోడ్పాటుగా ఉండేలా ఉద్దేశించబడ్డాము.**

**1 కొరింథీయులకు 12:22-27** వాక్యములు ఎంత గొప్పవో! చూద్దాం: "అంతేకాదు, శరీరము యొక్క అవయవములలో ఏవి మరి బలహీనములుగా కనబడునో అవి మరి అవశ్యములే. శరీరములో ఏ అవయవములు ఘనతలేనివని తలంతుమో ఆ అవయవములను మరి ఎక్కువగా ఘనపరచుచున్నాము. సుందరములుకాని మన అవయవములకు ఎక్కువైన సౌందర్యము కలుగును. సుందరములైన మన అవయవములకు ఎక్కువ సౌందర్యమక్కరలేదు. అయితే శరీరములో వివాదములేక, అవయవములు ఒకదాని నొకటి యేకముగా పరామర్శించులాగున, దేవుడు తక్కువ దానికే యెక్కువ ఘనత కలుగజేసి, శరీరమును అమర్చియున్నాడు. కాగా ఒక అవయవము శ్రమపడునప్పుడు అవయవములన్నియు దానితోకూడ శ్రమపడును; ఒక అవయవము ఘనత పొందునప్పుడు అవయవములన్నియు దానితోకూడ సంతోషించును. అటువలె, మీరు క్రీస్తుయొక్క శరీరమైయుండి వేరు వేరుగా అవయవములై యున్నారు".

ఈ వచనాలు మరియు అందులోని ఆధ్యాత్మిక బోధనలు మనకు గొప్ప ప్రేరణను అందిస్తాయి. మనం బలహీనులైనా లేదా శక్తివంతులైనా, బహిరంగ స్వభావమున్నవారైనా లేదా నిశ్శబ్ద స్వభావమున్నవారైనా, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారైనా లేదా ఆరోగ్యవంతులైనా, ధనికులైనా లేదా పేదలైనా, బైబిల్‌ను లోతుగా అధ్యయనం చేస్తున్నవారైనా లేదా ఇంకా నేర్చుకుంటున్నవారైనా, బహిరంగంగా ప్రార్థించేందుకు సంకోచించేవారైనా లేదా స్పష్టంగా అభివ్యక్తమయ్యేవారైనా – ప్రతి సభ్యుడిని అభినందించాలి మరియు ప్రతి ఒక్కరూ ఆ శరీరంలో తమకు నిర్దేశించబడిన ప్రత్యేక స్థానం కలిగి ఉండాలని ఆశించబడుతుంది.

మనం "నూతన సృష్టి (The New Creation)" పుస్తకంలోని 146 వ పేజీ నుండి కొన్ని ఉత్తేజకరమైన ఆలోచనలతో ముగించుకుందాం:

> మన ప్రభువు మనపై ఆరోపణలు చేయడానికి అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడని, మనల్ని కఠినంగా తీర్పు తీర్చడానికి ఇష్టపడుతున్నాడని మనం అనుకోకూడదు; కానీ మరోవైపు, ఆయన మంచితనం మరియు దయ ఎంత గొప్పవంటే, మనం ఇంకా పాపులుగా ఉన్నప్పుడే విమోచనను అందించడానికి ఆయన ప్రేరేపించబడ్డాడని గుర్తుంచుకోవాలి. నిశ్చయంగా, మనం ఆయన పిల్లలుగా మారి, ఆత్మచేత జన్మించబడి, మన శక్తికి సాధ్యమైనంత వరకు ఆయన మార్గంలో నడవడానికి ప్రయత్నిస్తున్నప్పుడు - శరీరమును అనుసరించి కాకుండా, ఆత్మను అనుసరించి - అటువంటి పరిస్థితులలో ఆయన ప్రేమ మనపై 'ఇతరులవలె ఉగ్రతకు పాత్రులమైన పిల్లలుగా' ఉన్నప్పటికంటే, ఇప్పుడు ఆయన మన పట్ల మరింత ప్రేమ చూపుతాడని నమ్మాలి. ఈ లోకపు తండ్రి తన పిల్లలను కనికరించినట్లు, ప్రభువు తనను భయభక్తులతో ఆరాధించేవారిని కనికరిస్తాడని మనం గుర్తుంచుకోవాలి. మన జీవన ప్రయాణంలో అత్యుత్తమ మిత్రులు మన పట్ల చూపే ప్రేమ, సహానుభూతి, కరుణలను మనం పరిగణించి, ఒక సారూప్యతను గీస్తే, దేవుడు తన సృష్టిలో అత్యుత్తమమైన వారి కంటే చాలా దయగలవాడు మరియు నమ్మకమైనవాడని చూడగలము. ఆయన అటువంటి విశ్వాసాన్ని, అటువంటి నమ్మకాన్ని కోరుకుంటాడు – అలాగే ఆయన దానికి ప్రతిఫలం ఇస్తాడు. మొదట్లోనే ప్రభువు వద్దకు రావడానికి తగినంత విశ్వాసం ఉన్నవారందరూ, వారు కోరుకుంటే, వారి పరీక్షలు,

కష్టాలు మరియు లోపాలతో రోజురోజుకు ఆయన వద్దకు రావడానికి తగినంత విశ్వాసం కలిగి ఉంటారు.

మన పరలోకపు తండ్రి మరియు మన ప్రభువైన యేసు మన విజయంను కోరుకుంటున్నారు. వారు ప్రతి ఒక్కరినీ ఆయన స్వరూపాన్ని ప్రతిఫలించే విధంగా, ప్రత్యేకమైనవారిగా తీర్చిదిద్దాలని ఆశిస్తున్నారు,దీని ద్వారా ఆయన మహిమ పొందుతారు.

**ఆమెన్**

BIBLE STUDENTS
Food for New Creature